హెచ్‌సీయూ ఫైనాన్స్‌ ఆఫీసర్‌గా శ్రీనివాస్‌


శ్రీనివాస్‌

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ నూతన ఆర్థిక అధికారి(ఫైనాన్స్‌ ఆఫీసర్‌)గా శ్రీనివాస్‌ నియమితులయ్యారు. ఆర్థిక, అకౌంట్లు, ఆడిట్‌, ప్రభుత్వ నిబంధనలు వంటి అంశాలపై 27 ఏళ్ల అనుభవం ఉన్న వ్యక్తికి అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా వైస్‌చాన్సలర్‌ ప్రొఫెసర్‌ బీజేరావు మాట్లాడుతూ హెచ్‌సీయూ ఆర్థిక స్థిరత్వం, వ్యయాన్ని నిర్ధారించడంలో కీలకంగా వ్యవహరిస్తారన్నారు.

దైవభక్తిని అలవర్చుకోవాలి

పటాన్‌చెరు టౌన్‌: ప్రతీ ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలని న్యాయవాది నాగరాజు యాదవ్‌ అన్నారు. ఆదివారం తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధి పోచారంలోని హనుమాన్‌ దేవస్థానం వద్ద భక్తులతో కలిసి హనుమాన్‌ చాలీసా పారాయణం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లల్లో భక్తిభావంతో పాటు దేశభక్తిని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో వివేకానంద సేవ సమితి అధ్యక్షుడు శేషాద్రి, బజరంగ్‌ దళ్‌ సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



అల్విన్‌కాలనీ: కూచిపూడి నృత్య కళా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ఆదివారం అవార్డులను అందజేశారు. బిర్లా భాస్కర ఆడిటోరియంలో కళాకర్‌ తెలుగు టీవీ, శివనంది అవార్డ్స్‌–2025 ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మిక గురువు దైవజ్ఞ శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నృత్య పోటీల్లో హైదర్‌నగర్‌లోని రుహాని కూచిపూడి నృత్య అకాడమి నిర్వాహకురాలు నేరెళ్ల కల్పన ఆధ్వర్యంలో బిందు మాధవి, భావనలతో పాటు పలువురు చిన్నారులు నృత్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కూచిపూడి నృత్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారులకు దైవజ్ఞ శర్మ అవార్డులు ప్రదానం చేశారు.

ఉచిత వైద్య శిబిరాలతో మేలు

కాంగ్రెస్‌ నేత నీలం మధు


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న నీలం మధు

పటాన్‌చెరు: గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాల ఏర్పాటుతో పేదలకు లబ్ధి చేకూరుతుందని కాంగ్రెస్‌ నాయకుడు నీలం మధు అన్నారు. ఆదివారం చిట్కుల్‌ గ్రామంలో నీలం మధు సహకారంతో మెడిస్టార్‌ హాస్పిటల్‌ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా మెడికల్‌ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో సామాన్యులకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం కాలుష్యం, రసాయనాలతో పంటల్ని పండించడం, కలుషిత ఆహారం తీసుకోవడం, శరీరానికి తగిన వ్యాయామం లేకపోవడం వల్ల అనేక వ్యాధుల బెడద పెరిగిందన్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల ద్వారా రోగాన్ని తెలుసుకుంటే తగిన చికిత్స తీసుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మెడిస్టార్‌ ఆస్పత్రి డాక్టర్‌ కిరణ్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ లత, డాక్టర్లు శివ మోహన్‌రెడ్డి, సంతోష్‌, ప్రకాశ్‌ పాల్గొన్నారు.

భక్తుల కోరికలు తీర్చేదైవం పెద్దమ్మ తల్లి

పటాన్‌చెరు టౌన్‌: కోరిన కోర్కెలు తీర్చే దైవం పెద్దమ్మ తల్లి అని కాంగ్రెస్‌ నేత నీలం మధు అన్నారు. ఆదివారం మేడ్చల్‌ జిల్లా కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గం.. దుండిగల్‌ మున్సిపాలిటీ పరిధిలోని పెద్దమ్మతల్లి వార్షికోత్సవంలో ఆయన పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు నీలం మధుకు స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ..ఆలయాల నిర్మాణంతో పాటు వార్షికోత్సవాలు నిర్వహించడం వల్ల గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తుందన్నారు. కార్యక్రమంలో దుండిగల్‌ మున్సిపాలిటీ సంఘం ప్రెసిడెంట్‌ వెంకటేష్‌, ఆలయ కమిటీ చైర్మన్‌ రవికుమార్‌, తలారి వెంకటేశ్‌, మహేష్‌, కృష్ణ, యాదగిరి, ఎంపీ మాణిక్యరావు, మహేశ్‌, బాబ్లు, ప్రవీణ్‌, ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.


రాయదుర్గంలోని శ్మశానవాటికలు

‘మరుభూమి’కి మహాభాగ్యం ఎన్నడో ?

పట్టించుకోని పాలకులు..ఇబ్బంది పడుతున్న స్థానికులు

ప్రతిపాదనలు చేయడం, ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశీలించడం, హామీ ఇవ్వడం, శంకుస్థాపన చేయడం, ఆతర్వాత మరిచిపోవడం.. ఇవే సరిపోయింది కానీ మరుభూమికి అభివృద్ధి భాగ్యం కలగట్లేదు. రాయదుర్గంలోని ఎస్సీల శ్మశానవాటికల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు మారుతున్నారు తప్ప వారి వైఖరిలో ఎలాంటి మార్పులు రాకపోవడం, వారు అవలంబిస్తున్న నిర్లక్ష్యవైఖరి పట్ల సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. రోడ్ల విస్తరణ కోసం శ్మశాన వాటిక స్థలాన్ని తీసుకొని అభివృద్ధిని పక్కన పెడుతున్నారనే విమర్శలున్నాయి. చెంతనే వైకుంఠ మహాప్రస్థానం ఉండగా దానికి చేరువలోనే ఉండే శ్మశానవాటికలు సమస్యలకు నిలయాలుగా మారాయి. ఇటీవల లింకు రోడ్ల నిర్మాణానికి శ్మశానవాటికల స్థలాన్ని తీసుకొని ముందు భాగంలో ప్రహరీ, ప్రధాన గేటునిర్మాణంతోనే సరిపెట్టారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– రాయదుర్గం


రాయదుర్గ ఎస్సీ శ్మశానవాటికకు ఇటీవల ఏర్పాటు చేసిన గేటు

శంకుస్థాపన, ప్రతిపాదన, పరిశీలన, హామీలకే పరిమితం

కొన్నేళ్ళుగా ఇబ్బందులు పడుతున్న స్థానికులు

ఇదీ రాయదుర్గం ఎస్సీ శ్మశానవాటికల దుస్థితి

కేటాయించింది అయిదెకరాలు మిగిలింది రెండున్నర ఎకరాలు

- రాయదుర్గంలోని మల్కంచెరువు కట్టకు ఆనుకొని ఎస్సీల కోసం రెండు ప్రత్యేక శ్మశానవాటికలను ఏర్పాటు చేశారు.
- మొత్తం 5 ఎకరాల స్థలంలో రోడ్లకు ఇవ్వగా తాజాగా రెండున్నర ఎకరాల స్థలం మాత్రమే మిగిలింది.
- మొదట్లో చిత్రపురికాలనీకి రోడ్డు కోసం శ్మశాన వాటికకు కొంత భూమిని తీసుకున్నారు.
- ఏడాదిన్నర క్రితం శ్మశనవాటికముందు మరో లింకురోడ్డు కోసం కొంత కోల్పోవాల్సి వచ్చింది.

2013లో శంకుస్థాపన

- రూ.26.35లక్షలతో ఏప్రిల్‌ 8, 2013లో అప్పటి ఎమ్మెల్యే భిక్షపతియాదవ్‌ శ్మశానవాటికలకు శంకుస్థాపన చేశారు.అయితే ఆతర్వాత ఎలాంటి పనులను ఇప్పటి వరకు చేయలేదు.
- అప్పట్లో రెండు శ్మశానవాటికలకు ప్రహరీగోడ, రెండు బర్నింగ్‌ప్లాంట్లు, బోర్లు వేయాలని నిర్ణయించారు. కానీ వెనుకవైపు ప్రహరీ పనులు ఆరంభించి ఆపివేశారు.
- ఆరేళ్ళ క్రితం మల్కంచెరువు వద్ద స్నానాల గదులు, కుళాయిల సౌకర్యం కల్పించారు.
- ఇటీవల లింకురోడ్డు పేరుతో వాటిని కూల్చివేయించారు. ఇప్పటికీ నిర్మాణం చేయలేదు
- శ్మశానవాటికవద్ద స్నానాలను ట్యాంకులతో నీళ్లు తెచ్చుకొని రోడ్డుపైనే స్నానాలు చేస్తున్నారు.
- అయిదేళ్ళక్రితం మేయర్‌ బొంతురామ్మోహన్‌, ఎమ్మెల్యే గాంధీ, శ్మశాన వాటిక స్థలాన్ని రోడ్డు విస్తరణకు పరిశీలించి శ్మశాన వాటిక అభివృద్ధికి హామీ ఇచ్చారు. రూ.65 లక్షల ప్రతిపాదనలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు
- శ్మశానవాటిక వ్యర్థాలు, పిచ్చిమొక్కలతో అపరిశుభ్ర వాతావరణంతో నిండిపోయింది
- రోడ్డు విస్తరణలో ముందుభాగానికి ప్రహరీ గోడ, ప్రధానగేటు నిర్మించి చేతులు దులుపుకున్నారు.

అభివృద్ధి మాటే లేదు



రోడ్ల నిర్మాణం పేరిట శ్మశానవాటిక స్థలాన్ని కోల్పోతున్నాం. అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, అధికారులు చేస్తున్న హామీలు నెరవేరడం లేదు. రాయదుర్గంలోని అన్ని శ్మశానవాటికలను మినీ మహాప్రస్థానం తరహాలో అభివృద్ధి చేయాలి. కాలనీ నుంచి శ్మశానవాటికల వరకు వీధి దీపాలు, వాటి చుట్టూ ప్రహరీ, స్నానాలగదులు, దుస్తులు మార్చుకునే గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, బర్నింగ్‌ప్లాంట్లు, ముఖ్యంగా గ్రీనరీని ఏర్పాటు చేయాలి.

– ఆవుల రవీందర్‌–రాయదుర్గం

ప్రహరీ నిర్మించాలి



రాయదుర్గంలోని శ్మశానవాటికలకు చుట్టూ ప్రహరీ నిర్మిస్తే కబ్జా సమస్య తీరుతుంది. అంతేకాకుండా మౌలిక వసతులు కల్పించి, చెత్తాచెదారం, మురికి చెట్లను తొలగించి అహ్లాద వాతావరణం కల్పించేందుకు గ్రీనరీని ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తే అందరికీ మేలు చేకూరుతుంది. ఆదిశగా అధికారులు, ప్రజాప్రతినిదులు చర్యలు తీసుకోవాలి

– గణేష్‌
శ్యామ్‌లేట్‌ వీధి రాయదుర్గం.



చెరువులను అభివృద్ధి చేసి సంరక్షిస్తాం


సుందరీకణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, తదితరులు

మియాపూర్‌: నియోజకవర్గంలోని అన్ని చెరువులను అభివృద్ధి చేసి సంరక్షిస్తామని పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. మల్లిగవాడ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో మియాపూర్‌ డివిజన్‌ పరిధిలోని గురునాథం చెరువు సుందరీకరణ పనులను కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గురునాథం చెరువు నేటితో దశ దిశ మారనుందన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

మియాపూర్‌: చందానగర్‌ డివిజన్‌ పరిధిలో గల దీప్తీ శ్రీనగర్‌ పార్కులో మెడికవర్‌ హాస్పిటల్స్‌ సౌజన్యంతో ఫ్రెండ్స్‌ వెల్ఫేర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ఆదిత్య, సలీం, నిసార్‌, విజన్‌ ఐ కేర్‌ తదితరులు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ... మారిన జీవన శైలిలో పర్యావరణంలో వస్తున్న అనేక మార్పుల వల్ల ప్రజలు అనేక వ్యాధులకు గురవుతున్నారన్నారని తెలిపారు. శిబిరంలో కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌నాయకులు సీతారామయ్య, సురేష్‌, సుమన్‌ రెడ్డి పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 20, పచ్చిమిర్చి 50, బెండ 60, కాకర 60, దొండ 50, దోస 50, ఆలు 30, చామ 60, కీర 30, బీర 60, వంకాయ 30, గోకర 60, బీన్స్‌ 60, బీట్‌రూట్‌ 40, క్యాప్సికమ్‌ 60, క్యాబేజీ 20, క్యారెట్‌ 30, చిక్కుడు 70, ఉల్లి 35(కేజీ), ములక్కాయలు (3) 20 , క్యాలీఫ్లవర్‌ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 200.

తక్కువ ఫీజుతో ఉత్తమ విద్యను అందించాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌


కార్యక్రమంలో పాల్గొన్న రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌

గచ్చిబౌలి: ప్రైవేటు విద్యాసంస్థలు తక్కువ ఫీజుతో నాణ్యతతో కూడిన విద్య అందించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్‌ అభిప్రాయపడ్డారు. శనివారం రాత్రి శిల్పకళావేదికలో సంస్కృతి గ్రూప్‌ ఆఫ్‌ స్కూల్స్‌ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మారుతున్న కాలం, టెక్నాలజీకి అనుగుణంగా విద్యాసంస్థలను నడపడం అభినందనీయమన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. రిటైర్డ్‌ ఐఏఎస్‌ అధికారి అజయ్‌మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



మాదాపూర్‌: కళాకారులు తమ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహూతులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం సైకినాడియా బృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో మైమరిపించారు. ఇందులో మూషికవాహన, మహిషాసురమర్ధిని తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. శ్రీనవ లాస్య కళానిలయం ఆధ్వర్యంలో కర్ణాటక గాత్ర కచేరి, కూడిపూడి నృత్యప్రదర్శనతో ఆకట్టుకున్నారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు



మియాపూర్‌: మదినాగూడ సబ్‌ స్టేషన్‌ పరిధిలో మరమ్మత్తుల కారణంగా విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాస్‌ రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 11 నుండి 3 గంటల వరకు కృష్ణసాయి, ఎన్‌క్లేవ్‌, ముక్తమహబూబ్‌పేట్‌, జనప్రియ వెస్ట్‌ సిటీ, జేపీఎన్‌ నగర్‌, నాగార్జున ఎన్‌క్లేవ్‌, డీకే ఎన్‌క్లేవ్‌ కాలనీలో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

మయూరినగర్‌ సబ్‌ స్టేషన్‌ పరిధిలో....

మయూరి నగర్‌ పరిధిలో ఉదయం 11 గంటల నుండి 2 గంటల వరకు మయూరినగర్‌ పార్క్‌, టెంపుల్‌ కాంప్లెక్స్‌ ఇందిరమ్మ కాలనీ ఫేస్‌ -2,ఆర్‌ఎల్‌, సిటీ రోడ్డు, ఓల్డ్‌ ఏజ్‌ హోం ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తామన్నారు.

గచ్చిబౌలి: కొండాపూర్‌ విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓయూ ప్రొఫెసర్‌ కాలనీ, మాధవహిల్స్‌, గోల్డెన్‌ తులిప్‌లోని రోడ్‌ నెంబర 1,2,3,4,5, వెంకటరమణ టాటా మోటార్స్‌లేన్‌, హైటెన్షన్‌ టవర్‌ లైన్‌ రోడ్‌ నుంచి విజేత సూపర్‌ మార్కెట్‌ రోడ్డు, జేవీజీ హిల్స్‌, శిల్పావ్యాలీ, సెంట్రల్‌ పార్కు ఫేజ్‌–2, గాయత్రి లేఅవుట్‌, కాంతివనం వంటి ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన వివరించారు.

చందానగర్‌ : చందానగర్‌, మదీనాగూడ సబ్‌స్టేషన్ల పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్‌ మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- పీజేఆర్‌ ఎన్‌క్లేవ్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 10.30 నుంచి 11 వరకు పీజేఆర్‌ ఏరియా రోడ్డు నెంబర్లు 1,3,5,7,10,12, లగ్జరీ అపార్ట్‌మెంట్‌ ప్రాంతాల్లో..
- శంకర్‌నగర్‌ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1.30 వరకు గౌతమీనగర్‌, వార్డు కార్యాలయం, బజాజ్‌ ఎలక్ట్రానిక్స్‌, శిల్పా ఎన్‌క్లేవ్‌ ప్రాంతాలలో..
- శాంతినగర్‌ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి నుంచి సాయంత్రం 5 వరకు శాంతినగర్‌, ఉషోదయా అపార్ట్‌మెంట్‌ రోడ్డు, ధర్మపురి టెంపుల్‌ రోడ్డు, దీప్తిశ్రీనగర్‌ రోడ్డు నెంబర్‌ 14 నుంచి 25 వరకు, ఆదర్శనగర్‌ ప్రాంతాలలో..
- సీబీఆర్‌ ఎస్టేట్‌ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు సీబీఆర్‌ ఎస్టేట్స్‌, క్రోమా భవనం వెనకాల, శ్రీ దుర్గ హోమ్స్‌, ఆంధ్ర బ్యాంక్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేపట్టాలంటూ నిరసన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓఆర్‌ఆర్‌ 30 ఎక్స్‌టెన్షన్‌ రేడియల్‌ రోడ్డు ధ్వంసమై గుంతలమయంగా ఏర్పడింది. సంబంధిత అధికారులు రోడ్డుకు ఎందుకు మరమ్మతులు చేపట్టడం లేదని ఆదివారం తెల్లాపూర్‌ గేటెడ్‌ కమ్యూనిటీ కాలనీవాసులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తెల్లాపూర్‌ నైబర్‌హుడ్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో వివిధ గేటెడ్‌ కమ్యూనిటీ కాలనీవాసులు శ్రమదానం చేసి గుంతలను పూడ్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనేక ఏళ్లుగా ఈ రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. రోడ్డుపై పెద్ద ఎత్తున మట్టి చేరి, గుంతలు ఏర్పడినా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. దీంతో స్వయంగా తామే శ్రమదానం చేసి రోడ్డుకు మరమ్మతు పనులు చేశామని చెప్పారు. ఈ మార్గంలో ఉన్న ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈరోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని ప్రభుత్వం ఎందుకు అభివృద్ధి చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని డిమాండ్‌ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.


నిరసన తెలుపుతున్న వివిధ కాలనీవాసులు

‘ఎన్‌ఐఏబీ’లో ముగిసిన వేడుకలు


వివిధ పోటీలలో పాల్గొన్న ఉద్యోగులు, విద్యార్థులు


గౌలిదొడ్డిలోని ఎన్‌ఐఏబీ క్యాంపస్‌లో మొక్కలు నాటుతున్న దృశ్యం

రాయదుర్గం: గౌలిదొడ్డిలోని జాతీయ జంతు జీవ సాంకేతికత సంస్థ(ఎన్‌ఐఏబీ)లో మూడు రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాలు ఆదివారం ముగిశాయి. శుక్ర, శని, ఆదివారాల్లో విద్యావైజ్ఞానిక ప్రదర్శన, ప్రత్యేక ఉపన్యాసం మొక్కలు నాటే కార్యక్రమం, క్రీడా పోటీలను నిర్వహించారు. క్యాంపస్‌లో పలు రకాల మొక్కలను నాటారు. ఇదిలా ఉండగా ఎన్‌ఐఏబీ హైదరాబాద్‌ క్యాంపస్‌లో క్రీడాపోటీలనుగత నెలరోజులపాటు ఉత్సాహంగా, ఉల్లాసంగా నిర్వహించారు. విధులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా ఈ వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించగా వాటిల్లో క్రీడాస్ఫూర్తితో ఉద్యోగులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం క్రీడాపోటీలలో గెలుపొందిన వారికి ఎన్‌ఐఏబీ డైరెక్టర్‌ డాక్టర్‌ జి తరుశర్మ బహుమతులను అందించారు.

రాందేవ్‌రావ్‌ హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం

అల్విన్‌కాలనీ: రాందేవ్‌రావ్‌ హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. చెవినొప్పి, వినికిడి లోపం, చెవి నుంచి ద్రవం కారటం, తల తిరగడం, ముక్కు మూసుకుపోవటం, ముక్కు నుంచి రక్తం కారటం, ముక్కు నొప్పి, గొంతు నొప్పి, దగ్గు, చేదు శ్వాస, అలర్జీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హాస్పిటల్‌ సీఈఓ డాక్టర్‌ యోబు, ఈఎన్‌టీ సర్జన్‌లు డాక్టర్‌ ఎస్‌ శ్వేత, డాక్టర్‌ డి. లావణ్య, డాక్టర్‌ సి. స్వాతి, డాక్టర్‌ కె. శ్రీహర్ష, డాక్టర్‌ డైరెక్టర్‌ కమలాకర్‌, విక్రమ్‌దేవ్‌రావు, మీరా రావు, ప్రశాంత్‌ రెడ్డి, అపర్ణరావు పాల్గొన్నారు.

తీరనున్న ట్రాఫిక్‌ కష్టాలు


లింగంపల్లి చౌరస్తాలో సిద్ధమైన ఫ్లైఓవర్‌


ఫ్లైఓవర్‌ నిర్మాణానికి ముందు లింగంపల్లి చౌరస్తాలో ట్రాఫిక్‌ (ఫైల్‌)

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని లింగంపల్లి చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్‌జామ్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సంగతి అందరికీ తెలిసిందే. 2022లో జ్యోతినగర్‌ నుంచి లింగంపల్లి చౌరస్తా మీదగా చందానగర్‌ వరకు ఫ్లైఓవర్‌ నిర్మాణానికి రూ.130కోట్ల నిధులు అప్పటి ప్రభుత్వం మంజూరు చేసి పనులు చేపట్టింది. ప్రస్తుతం ఫ్లైఓవర్‌ పనులు పూర్తికావడంతో స్థానికులు, వాహనదారులు ఊపిరి పీల్చుకుంటున్నారు. నిత్యం గంటకు పైగా ట్రాఫిక్‌ జామ్‌తో ఇక్కట్లు పడిన వాహనదారులు ఫ్లైఓవర్‌ పూర్తికావడంతో సంబరపడుతున్నారు. ప్రస్తుతం ఫ్లైఓవర్‌ను అధికారికంగా ప్రారంభించకపోయిన వాహనాల రాకపోకలకు అనుమతి ఇచ్చారు. ట్రాఫిక్‌ జామ్‌ లేకుండా వాహనదారులు ప్రశాంతంగా ప్రయాణం సాగిస్తున్నారు.